సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎం.గౌతమి

పక్కాగా ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లు

◆ అప్పజెప్పిన విధులను ఆయా అధికారులు సక్రమంగా నిర్వర్తించాలి

◆ కలెక్టర్ ఎం.గౌతమి, ఎస్పీ కె.శ్రీనివాసరావు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ముఖ్యమంత్రి ఈ నెల 17వ తేదీన నార్పలలో చేపట్టబోయే కార్యక్రమానికి సంబంధించి పక్కాగా ఏర్పాట్లను పూర్తి చేసి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి విజయవంతం చేయాలని కలెక్టర్ ఎం.గౌతమి, ఎస్పీ కె.శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు. గురువారం ఉదయం స్థానిక కలెక్టరేట్లోని రెవెన్యూ భవనంలో జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్‌తో కలిసి ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై జిల్లా అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 17వ తేదీన నార్పల మండల కేంద్రంలో జగనన్న వసతి దీవెన కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాల్గొంటున్నారని తెలిపారు. హెలిప్యాడ్ నుంచి సభాస్థలి వరకు ముఖ్యమంత్రి విచ్చేసే మార్గంలో ఎలాంటి అవాంతరాలు లేకుండా తగినంత రోప్ పార్టీలను ఏర్పాటు చేసుకుని పక్కాగా బందోబస్తు చర్యలు తీసుకోవాలన్నారు. పార్కింగ్, భోజన సదుపాయం ఏర్పాటు చేసిన ప్రదేశాల్లో ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా పోలీసు సిబ్బందిని కేటాయించాలన్నారు. విఐపిలు, అధికారులు, వాహనాల పాసుల జారీ విషయంలో సభాస్థలి, హెలిప్యాడ్ వద్ద సీటింగ్ కెపాసిటీని అనుసరించి పాసులు జారీ చేయాలన్నారు. వివిధ సంక్షేమ శాఖల అధికారులు విద్యార్థులు, లబ్ధిదారులను వారికి ఏర్పాటు చేసిన బస్సులలో సమావేశానికి తీసుకొని వచ్చి క్షేమంగా తిరిగి వారి గమ్య స్థానాలలో చేర్చాలన్నారు. సభాస్థలి వద్ద నిరంతర విద్యుత్ ఉండేలా చూడాలన్నారు. ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం అయ్యేలా వారికి అప్పజెప్పిన విధులను సక్రమంగా నిర్వహించేలా అధికారులందరూ కషి చేయాలన్నారు. ఎస్పీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటనకు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. నార్పల నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద ఒకవైపు వాహనాలు వెళ్లేలా మరొకవైపు విఐపి వాహనాలు వెళ్లేలా ఏర్పాట్లు చేస్తామన్నారు. అన్ని ప్రాంతాల్లో తగినంత పోలీసు సిబ్బందిని ఏర్పాటు చేసి పక్కాగా భద్రతాపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమావేశ ప్రాంతంలో ఏవైనా సమస్యలు ఉంటే అక్కడ విధులు నిర్వహిస్తున్న సిబ్బందితో వాదనకు దిగకుండా డీఎస్పీ ప్రసాద్ రెడ్డిని సంప్రదించాలన్నారు.

◆ టిడిపి శ్రేణుల్లో నూతనోత్తేజాన్ని నింపిన యాత్ర

◆ కదిరి నియోజకవర్గం నుంచి తాడిపత్రి వరకు కొనసాగిన యాత్ర

◆ అన్ని నియోజకవర్గాల్లో భారీగా పాల్గొన్న తెలుగు దేశం అభిమానులు

◆ కలిసొచ్చిన ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు

ముగిసిన 'యువగళం'

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

యువగళం పేరుతో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన పాదయాత్ర గురువారంతో ఉమ్మడి అనంతపురం జిల్లాలో ముగిసింది. గురువారం ఉదయం యాడికి మండలం దైవాలమడుగు గ్రామం మీదుగా కర్నూలు జిల్లాలోకి ప్రవేశించింది. సుమారు నెల రోజుల పాటు ఉమ్మడి అనంతపురం జిల్లాలో లోకేష్ పాదయాత్ర సాగింది. తొమ్మిది నియోజకవర్గాల్లో సాగిన ఈ యాత్ర టిడిపి శ్రేణుల్లోనూ నూతనోత్తేజాన్నే నింపిందని చెప్పవచ్చు. ఈ యాత్ర సాగుతున్న సమయంలోనే రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికల్లో టిడిపి విజయం సాధించడం ఆ పార్టీకి మరింత ఊపును తెచ్చింది. సగటున నియోజకవర్గానికి మూడు రోజుల చొప్పున సాగిన ఈ యాత్రలో లోకేష్ అందరినీ కలుసుకుంటూ ప్రజా సమస్యలు తెలుసుకోవడమే కాకుండా వాటికి తాము అధికారంలో వస్తే పరిష్కరిస్తామన్న హామీలూ ఇస్తూ పోయారు. సామాజిక తరగతుల వారీగా సమస్యలతోపాటు రైతులు, ఇతర వృత్తిదారులను కూడా కలుసుకుని వారిని ఆదుకుంటామన్న భరోసాను కల్పిస్తూ ఈ యాత్ర సాగింది. ఈ యాత్రకు కొన్ని చోట్ల భారీ స్పందన సైతం కనిపించింది. మరోవైపు నియోజకవర్గంలో ఆయా నియోజకవర్గ ఎమ్మెల్యేల పనితీరును, అవినీతిని ఎత్తిచూపడం, దానిపై వైసిపి ప్రతిస్పందించడంతో రాజకీయ వాతావరణం వేడెక్కింది. విమర్శలు, ప్రతి విమర్శలు తీవ్ర స్థాయిలోనే రెండు పార్టీల మధ్య సాగాయి. పుట్టపర్తిలో రెండు పార్టీలకు చెందిన వారు ఏకంగా ఘర్షణకు సైతం దిగడం ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. ధర్మవరంలో యర్రగుట్టను ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి కబ్జా చేసారన్న ఆరోపణలపైనా పెద్ద దుమారమే రేగింది. దీనిపై నారా లోకేష్, ఎమ్మెల్యే కేతిరెడ్డి మధ్య రెండు, మూడురోజుల పాటు ఆరోపణల పర్వం కొనసాగింది. ఆ తరువాత రాప్తాడు జాకీ పరిశ్రమ పోవడానికిగల కారణాలపైన టిడిపి, వైసిపిల మధ్య మాటల యుద్ధం సాగింది. శింగనమలలో ఇన్‌ఛార్జి పాలన వైసిపి సాగిస్తోందన్న దీనిపై విమర్శలు ప్రతివిమర్శలు సాగాయి. తాడిపత్రిలో నియోజకరవ్గంలోకి అడుగు పెట్టకముందే తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి సవాల్, ప్రతిసవాళ్లు విసరడమే కాకుండా ఆధారాల్లేకుండా ఆరోపణలు చేస్తే సహించబోమని చెప్పడంతో యువగళం పాదయాత్ర అక్కడ అడుగు పెట్టకముందే రాజకీయ వాతావరణం మరింత వేడెక్కింది. ఈ పరిస్థితుల్లో శాంతిభద్రతల సమస్య వచ్చే అవకాశముందని భావించిన పోలీసులు లోకేష్‌కు ముందస్తుగా నోటీసులు అందజేయడం చర్చనీయాంశమైంది. రెచ్చగొట్టే ప్రసంగాలు చేస్తే చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ మాటల యుద్ధం నడుమే పాదయాత్ర ముగిసింది. పాదయాత్ర ముగింపు రోజు గురువారం నాడు జిల్లా దాటుతున్న సమయంలో లోకేష్ ప్రకటన విడుదల చేశారు. ఈ జిల్లా ప్రజలు చూపిన ఆదరణ అభిమానాలు గుర్తుపెట్టుకుంటానని చెప్పారు. ఇక్కడి సమస్యలను పరిష్కరించ డంలో ప్రభుత్వం ఏ రకంగా విఫలమైందన్నది తెలిసిందన్నారు. టిడిపి అధికారంలోకి వస్తే సమస్యలను పరిష్కరిస్తామని హామీనిచ్చారు. ఈ రకంగా జిల్లాలో యువగళం పాదయాత్ర నెల రోజులపాటు సాగింది. ఈ యాత్రకు ప్రజల్లో కనిపించిన స్పందన చూసి నేతల్లో ఉత్సాహం పెరిగింది. మరో ఏడాది ఎన్నికలున్న సమయంలో ఈ యాత్ర విజయవంతమవడం, మండలి ఎన్నికల్లో విజయం కలిపి వచ్చే ఎన్నికల్లో పార్టీకి అనుకూలమైన వాతావరణం కనిపిస్తోందన్న ఆనందం ఆ పార్టీ శ్రేణుల్లోనూ కనిపిస్తోంది.

ఎస్పీకి పుష్పగుచ్ఛాలు అందజేస్తున్న పోలీసు సిబ్బంది

శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు

ఎస్పీ ఎస్‌వి.మాధవరావు

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

శ్రీ సత్యసాయి జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు అన్ని చర్యలూ తీసుకుంటామని నూతన ఎస్పీ ఎస్‌వి.మాధవరావు తెలిపారు. సత్యసాయి జిల్లా నూతన ఎస్పీగా ఎస్‌వి.మాధవ రెడ్డి బుధవారం రాత్రి బాధ్యతలను స్వీకరించారు. గురువారం ఉదయం కార్యాలయానికి వచ్చిన ఎస్పీకి సిబ్బంది ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎస్పీ మీడియాతో మాట్లాడుతూ జిల్లాలోని సమస్యలపై పూర్తి అవగాహన చేసుకోవాల్సి ఉందన్నారు. శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా పని చేస్తామని చెప్పారు. పోలీసులు సామాన్యులకు పూర్తి స్థాయి అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. జిల్లా యంత్రాంగం, పోలీసు సిబ్బందిని సమన్వయం చేసుకుని ముందుకెళ్తామన్నారు. పోలీసు సిబ్బంది, వారి కుటుంబాల కోసం జిల్లాలో అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తూ, మరికొన్ని నూతన సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయడానికి ప్రయత్నం చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్పీతో పాటు జిల్లా అదనపు ఎస్పీ కెవి.రామకష్ణ ప్రసాద్, కదిరి డీఎస్పీ భవ్యకిషోర్, పెనుకొండ డీఎస్పీ హుస్సేన్‌పీరా, ఎస్పీ డీఎస్పీ ఉమా మహేశ్వర రెడ్డి, ఎఆర్ డీఎస్పీ విజయ కుమార్, పట్టణ సిఐ బాలసుబ్రమణ్యం, సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఎస్పీ

ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన ఎస్పీ మాధవరెడ్డి కలెక్టర్ అరుణ్‌బాబును గురువారం నాడు మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయానికి వెళ్లి కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా పరిస్థితులపై ఇద్దరు అధికారులు కాసేపు మాట్లాడుకున్నారు.

అందరి సహకారం మరువలేనిది

బదిలీ ఎస్పీ రాహుల్‌దేవ్‌సింగ్

ప్రజాశక్తి-పట్టపర్తి రూరల్

నూతన జిల్లాలో మొదటి ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన తనకు విధి నిర్వహణలో అధికారులు, ప్రజాప్రతినిధులు, పోలీసులు అందించిన సహకారం మరువలేనదని బదిలీపై వెళ్తున్న ఎస్పీ రాహుల్‌దేవ్ సింగ్ తెలిపారు. సత్యసాయి జిల్లా ఎస్పీగా పని చేస్తూ బదిలీపై విజయవాడ రైల్వే ఎస్పీగా వెళుతున్న రాహుల్ దేవ్ సింగ్‌ను శ్రీసత్యసాయి జిల్లా ఎస్పీ కార్యాలయ సిబ్బంది గురువారం నాడు ఘనంగా వీడ్కోలు పలికారు. పుట్టపర్తిలోని పోలీస్ పరేడ్ మైదానంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సంవత్సరకాలంలో సిబ్బంది అందరి సహకారంతో జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణకు విశేష కృషి చేశామన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ కెవి.రామకష్ణ ప్రసాద్, ఎఆర్ డీఎస్పీ విజయ కుమార్, లీగల్ అడ్వైయిజర్ సాయినాథ్ రెడ్డి, ఆర్ఐలు శ్రీశైలం రెడ్డి, నారాయణ పాల్గొన్నారు.

కేసుల పరిష్కారానికి సహకరించండి

అదనపు జిల్లా జడ్జి శైలజ

ప్రజాశక్తి-హిందూపురం

త్వరలో జరిగే మెగాలోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారానికి అందరూ సహకరించాలని అదనపు జిల్లా జడ్జి శైలజ కోరారు. గురువారం కోర్టు ఆవరణలో మెగా లోక్ అదాలత్ నిర్వహణపై పోలీసులతో పాటు వివిధ శాఖల అధికారులతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మే 13వ తేదీన హైకోర్టు ఆదేశాల మేరకు మెగా లోక్‌అదాలత్ నిర్వహిస్తామన్నారు. అన్ని శాఖల అధికారులు సహకరించి సాధ్యమైనంత మేర అధిక సంఖ్యలో కేసులను పరిష్కరించేందుకు సహకరించాలన్నారు. ఈ సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి శ్రీధర్, ప్రత్యేక మెజిస్ట్రేట్ ఆనంద తీర్థ, ఏపీపీలు ఇందాద్, నగేష్, ఏజీపీ శ్రీనివాస్ రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు నాగరాజు, సిఐలు, ఎస్ఐలు, లోక్ అదాలత్ శారద, హేమావతి తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తిలో ఎండలు బాబోయ్.!

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

పుట్టపర్తిలో గత మూడు రోజులుగా ఎండలు ఠారెత్తిస్తున్నాయి. అధిక ఉష్ణోగ్రతలతో పుట్టపర్తి జనం అల్లాడుతున్నారు. గురువారం నాడు ఎండ తీవ్రత ఉదయం 11 గంటలకే తీవ్రం అయ్యింది. దీంతో పుట్టపర్తి వీధులు జనం లేక బోసిపోయాయి. చిత్రావతి రోడ్డు, సమాధి రోడ్డు ,షాపింగ్ మాల్స్ వద్ద జనం కన్పించలేదు. గురువారం నాడు పుట్టపర్తిలో అత్యధికంగా. 40.27 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. పుట్టపర్తిని చూసేందుకు వచ్చిన విదేశీయులు ఉదయం 10 గంటలు దాటితే బయటికి రావడానికే వెనుకంజ వేస్తున్నారు. రానున్న రోజుల్లో ఎండతీవ్రత మరింత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో జనం మరింత జాగ్రత్తగా ఉండాలని వాతావరణ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.

ఉదయం 11 గంటలకు నిర్మానుష్యంగా ఉన్న పుట్టపర్తి ప్రశాంతి నిలయం రహదారి

ఇసుక రీచ్‌వద్ద ఆందోళన చేస్తున్న సిపిఎం నాయకులు

సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్‌ను అరెస్టు చేస్తున్న పోలీసులు

ఇసుకరీచ్ నిలుపుదలపై ఆగని సిపిఎం పోరాటం

◆ తవ్వకాలను అడ్డుకున్న నాయకులు ◆ సిపిఎం నేతల అరెస్టు, విడుదల

ప్రజాశక్తి-పరిగి

స్థానిక రైతులు, ప్రజలకు నష్టం చేకూర్చేలా ఉన్న పరిగి సమీపంలోని జయమంగళి నది సమీపంలో ఉన్న ఇసుక రీచ్‌లో తవ్వకాలను నిలుపుదల చేయాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన ఆందోళనలు కొనసాగుతున్నాయి. గురువారం నాడు రీచ్ వద్ద పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్ ఆధ్వర్యంలో నేత్రపల్లి, ఊటకూరు, బోరెడ్డిపల్లి, కాలువపల్లి, కోడిగెనహళ్లి గ్రామాల రైతులు, ప్రజలతో కలిసి రీచ్ వద్ద ఆందోళన చేపట్టారు. ఆందోళన చేస్తున్న వారిని పోలీసులు అడ్డుకున్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్‌తో పాటు రైతుసంఘం జిల్లా అధ్యక్షులు పెద్దన్న, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పెద్దన్న, సిఐటియు జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, రాము, ఫ్రీ కాట్ మిల్ వర్కర్స్ యూనియన్ సభ్యులను అరెస్టు చేసి హిందూపురం పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఇంతియాజ్ మాట్లాడుతూ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరన్నారు. గ్రామ గ్రామాన తిరిగి మండల వ్యాప్తంగా ప్రజలను ఐక్యం చేసే ఇసుక రీచ్ రద్దు అయ్యే వరకు తమ పోరాటాలు కొనసాగిస్తామన్నారు. రీచ్‌లో ఇసుక తరలింపు వల్ల ఈ ప్రాంతంలో నీటి సమస్య తీవ్రం అవుతుందన్నారు. నిబంధనలకు విరుద్ధంగా జయమంగళి నదిలో ఇసుక రీచ్ ఏర్పాటుకు ప్రభుత్వ అనుమతులు ఇచ్చిందన్నారు. రీచ్ వద్ద నిబంధనలను తుంగలో తొక్కి తవ్వకాలు చేస్తున్నారని చెప్పారు. వీటన్నింటినీ కలెక్టర్ దష్టికి తీసుకెళ్తామని ఆయన అన్నారు. ఇసుక తరలింపును ఆపకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

పవర్‌లూమ్స్‌లో చేనేత రకాలు నేయకుండా చర్యలు

◆ ధర్మవరంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యాలయం ఏర్పాటు చేస్తాం ◆ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఉపసంచాలకులు రాజారావు

ప్రజాశక్తి-ధర్మవరంటౌన్

పవర్‌లూమ్స్‌లో చేనేత హ్యాండ్‌లూమ్ రకాలను నేయకుండా ప్రత్యేక చర్యలు చేపడుతామని తిరుపతి చేనేత జౌళిశాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఉపసంచాలకులు రాజారావు పేర్కొన్నారు. పట్టణంలోని సెరిఫెడ్ కార్యాలయంలో గురువారం నాడు చేనేత కార్మికుల ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి తిరుపతి చేనేత జౌళిశాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఉపసంచాలకులు రాజారావు, ఎన్‌ఫోర్స్‌మెంట్ సహాయ సంచాలకులు అప్పాజీ, చేనేత జౌళిశాఖ జిల్లా అధికారి రమేశ్ హాజరయ్యారు. ఈ సమావేశంలో ముందుగా ఏపీ చేనేత కార్మికసంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోలా రామాంజినేయులు, రాష్ట్ర ప్రధానకార్యదర్శి జింకాచలపతి, చేనేత ప్రముఖులు పల్లెం వేణుగోపాల్, గడ్డం పార్థసారథిలు చేనేతలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులకు వివరించారు. 15 ఏళ్ల క్రితం ధర్మవరంలో చేనేత పరిశ్రమ ఓ వెలుగు వెలిగిందన్నారు. అలాంటి పరిశ్రమ నేడు పాలకులు, అధికారుల నిర్లక్ష్యం వల్ల నిర్వీర్యం అయ్యిందన్నారు. ప్రస్తుతం ధర్మవరంలో పవర్లూమ్స్ మగ్గాలు రావడం వల్ల హ్యాండ్లూమ్ మగ్గంలో నేసే చేనేత కార్మికుల పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. ఇందుకు కారణం పవర్‌లూమ్స్‌లో చేనేత రకాలు నేయడం వల్లనే అని మండిపడ్డారు. చేనేతరకాలను పవర్‌లూమ్స్‌లో నేయకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పవర్‌లూమ్స్ యజమానులకు వేల కోట్ల రుపాయిలు రుణాలు అందిస్తారని, అదే చేనేత కార్మికులకు బ్యాంకులలో కనీసం రూ.ఒక లక్ష ఇవ్వడానికి సవాలక్ష కారణాలు అడుగుతారన్నారు. చేనేత రిజర్వేషన్ చట్టాన్ని పక్కాగా అమలు చేయాలన్నారు. జీఎస్టీని రద్దుచేయాలన్నారు. మగ్గం ఉన్న ప్రతి కార్మికునికీ 200 యూనిట్లు ఉచితంగా కరెంటు ఇవ్వాలనే సమస్యలను ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దృష్టికి తెచ్చారు. అనంతరం ఎన్‌ఫోర్స్‌మెంట్ ఉపసంచాలకులు రాజారావు మాట్లాడుతూ ధర్మవరంలో పవర్‌లూమ్స్‌లో చేనేత రకాలు నేయకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. స్థానికంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యాలయ ఏర్పాటు విషయాన్ని ఉన్నతాధికారుల దష్టికి తీసుకెళ్తామన్నారు. నేతన్న నేస్తాన్ని అర్హులైన కార్మికులకు అందజేసేలా చూస్తామన్నారు. ఈ సమావేశంలో ఏపీ చేనేత కార్మికసంఘం తాలూకా అధ్యక్ష, కార్యదర్శులు వెంకటస్వామి, వెంకట నారాయణ, నాయకులు వైవి.రమణ, చింతా శ్రీనివాసులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న చేనేత ఎన్‌ఫోర్స్‌మెంట్ ఉపసంచాలకులు రాజారావు

మున్సిపల్ కార్మికుల సమస్యలపై స్పందించండి

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

సమస్యల పరిష్కారం కోరుతూ పట్టణంలో మున్సిపల్ కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు కార్మికులు గురువారం ర్యాలీ నిర్వహించారు. సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె ఆగదని, మున్సిపల్ కార్మికుల సంఘం నాయకులు సిఐటియు నాయకులు ప్రకటించారు. కార్మికులకు మూడు నెలల వేతనాలతో పాటు ఎనిమిది నెలల పిఎఫ్ ఇవ్వాలని ప్రధానంగా కార్మికులకులు డిమాండ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు బ్యాళ్ల అంజి, బైపల్లి గంగాద్రి, కార్మికులు మాట్లాడుతూ ఉద్యోగులు నెలవారీగా వేతనాలు తీసుకోంటూ, పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుతున్న కార్మికులకు వేతనాలు ఎందుకు ఇవ్వరని ప్రశ్నించారు. న్యాయమైన సమస్యలు ప్రభుత్వం నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్మిక సంఘం నాయకులు గోవిందు, పెద్దన్న, రామయ్య, నాగార్జున, నరసింహులు, తిరుపాలు తదితరులు పాల్గొన్నారు.

క్లాప్‌ను వంద శాతం అమలు చేద్దాం

సమీక్ష సమావేశంలో కమిషనర్ ప్రమోద్‌కుమార్

ప్రజాశక్తి-హిందూపురం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న క్లాప్ కార్యక్రమాన్ని హిందూపురం పురపాలక సంఘంలో వంద శాతం అమలు చేసి స్వచ్ఛ హిందూపురం లక్ష్యంగా ముందుకు వెళ్దామని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ సూచించారు. గురువారం పురపాలక కార్యాలయంలో పట్టణ పారిశుధ్యంపై సచివాలయ శానిటరీ సెక్రెటరీలు, మేస్త్రీలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్లాప్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ ప్రచారం చేసి ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరణ చేపట్టాలన్నారు. తడి, పోడి, ప్రమాదకర చెత్తను వేరు చేయడంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కేంద్ర ప్రభుత్వ సూచనలతో పాటు ఎన్‌జిటి నిబంధనలు తప్పనిసరిగా అమలు చేయాల్సిన భాధ్యత అందరిపై ఉందన్నారు. అందరం కలిసి స్వచ్ఛ సంకల్పంతో స్వచ్ఛ హిందూపురం లక్ష్యం చేరుకోవడం పెద్ద కష్టం కాదన్నారు. ఈ కార్యక్రమంలో ఎఈ నాగేంద్ర, ఇన్‌ఛార్జి శానిటరీ ఇన్స్‌పెక్టర్ నెట్టిగల్లు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ ప్రమోద్ కుమార్

విరాళం అందజేస్తున్న డాక్టర్ బత్తల హరిప్రసాద్

మసీద్ మరమ్మతులకు రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి-కదిరి టౌన్

కదిరి పట్టణంలోని రాయచోటి రోడ్‌లో నూతనంగా నిర్మిస్తున్న మక్క మజీద్ నిర్మాణానికి వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ బత్తల హరిప్రసాద్ రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. ఇటీవల ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో బత్తల హరిప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మజీద్ మరమ్మతులకు గతంలో ఇచ్చిన వాగ్దానం మేరకు గురువారం నాడు లక్ష రూపాయలను మజీద్ ముతవల్లి నల్లమడ నిజంకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి లింగాల లోకేశ్వర్ రెడ్డి, వైసిపి పట్టణ అధ్యక్షులు బహుద్దీన్, కదిరి రూరల్ వైస్ ఎంపిపి బత్తల ఆదినారాయణ, ఏసు, రహీం, ఖలీల్, మసీదు కమిటీ సభ్యులు, మతపెద్దలు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రం తనిఖీ

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

పుట్టపర్తి మండల పరిధిలోని యనమలపల్లి ఉన్నత పాఠశాలలోని పరీక్ష కేంద్రాన్ని శ్రీ సత్యసాయి జిల్లా జాయింట్ కలెక్టర్ టిఎస్.చేతన్ సందర్శించారు. పరీక్ష కేంద్రంలో ఏర్పాట్లను విద్యార్థులతో అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట పుట్టపర్తి తహశీల్దార్ నవీన్‌కుమార్, డిప్యూటీ తహశీల్దార్ నరసింహులు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి-ముదిగుబ్బ

మండలంలోని మల్లయ్యకుంటపల్లి గ్రామంలో ఉమ్మడి అనంతపురం జిల్లా వాల్మీకి సేవాదళ్ యూత్ ప్రధాన కార్యదర్శి బాలచంద్ర తండ్రి చిన్న రాయుడు గత నెలలో అనారోగ్యంతో మతి చెందాడు. ఈయన కుటుంబాన్ని రాష్ట్ర వాల్మీకి సేవాదళ్ అధ్యక్షుడు, హిందూపురం పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి అంబికా లక్ష్మీనారాయణ గురువారం పరామర్శించారు. చిన్నరాయుడు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఇటీవల బత్తలపల్లి మండలం పోట్లమర్రి గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన గాలి నారాయణస్వామి కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి సంఘం నాయకులు మద్దిలేటి మంజునాథ్, అంజి, రమణ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభం

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

పట్టణంలోని కెహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు కంప్యూటర్, కాంపిటీటివ్ ఎగ్జామ్స్‌కు ఉచిత శిక్షణ తరగతులు గురువారం నుంచి ప్రారంభం అయ్యాయని ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణ తరగతులు నెల రోజులు పాటు జరుగుతాయన్నారు. ఇందులో కంప్యూటర్, కాంపిటీటివ్ ఎగ్జామ్స్‌కు శిక్షణ ఇస్తామన్నారు. వీటితో పాటు స్పోర్ట్స్ సమ్మర్ క్యాంప్ కూడా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇంటర్మీడియట్ పూర్తయిన విద్యార్థులు మాత్రమే శిక్షణకు అర్హులన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు రాబియా బేగం, చిట్టెమ్మ, షమీవుల్లా, గోపాల్ నాయక్, కిరణ్ కుమార్, భువనేశ్వరి, కె.స్వామి, పుష్పావతి, గౌతమి, ఆనంద్, రామ్మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

ప్రతి సంక్షేమ పథకం అర్హులైన లబ్ధిదారులకు అందేలా చర్యలు చేపట్టాలని ఇన్‌ఛార్జి ఎంపీడీవో మమతాదేవి పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని గుడ్లూరు సచివాలయంలో సిబ్బంది, వాలంటీర్లకు సంక్షేమ పథకాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చే ప్రతి సంక్షేమ పథకం, అర్హులైన వారికి అందేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. అనంతరం మమతాదేవి పట్టణంలోని జీవనజ్యోతి పదవ తరగతి పరీక్షా కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు.

ప్రశాంతంగా పదో తరగతి పరీక్షలు

ప్రజాశక్తి-కొత్తచెరువు

శ్రీ సత్యసాయి జిల్లా వ్యాప్తంగా పదవ తరగతి పరీక్షలు గురువారం ప్రశాంతంగా జరిగాయని ఇన్‌ఛార్జి డిఇఒ మీనాక్షి తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 125 సెంటర్లలో 24,523 మంది సైన్స్ పరీక్ష రాయాల్సి ఉండగా 289 మంది విద్యార్థులు జిల్లా వ్యాప్తంగా పరీక్షకు గైర్హాజరు అయ్యారన్నారు.

దళితుల గుడిసెలు దహనం హేయమైన చర్య

ప్రజాశక్తి-కదిరి టౌన్

దళితుల గుడిసెలు దగ్ధం చేయడం హేయమైన పిరికిపంద చర్య అని టిడిపి ఎస్సీ సెల్ నాయకులు రాజశేఖర్ బాబు విమర్శించారు. కదిరి పట్టణం అడపాల వీధి సర్వే నంబర్ 206లో పేద దళితులు గత 5 నెలలుగా వేసుకున్న గుడిసెలు దహనంకు నిరసనగా అంబేద్కర్ సర్కిల్‌లో తెలుగుదేశం పార్టీ, నాయకులు నిరసన చేపట్టారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ ప్రభుత్వ స్థలం అయినప్పటికీ అధికార మదంతో వైకాపాకు చెందిన నాయకులు రాత్రికి రాత్రి ఇళ్లు నిర్మిస్తున్నారని విమర్శించారు. అలాంటిది పేదలు ఐదు నెలల క్రితం వేసుకున్న గుడిసెలు దహనం చేయడం వారి అధికార దర్పానికి నిదర్శనం అన్నారు. అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ నాయకులు , ,అఖిల పక్షాలు, దళిత సంఘాలు, పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

ప్రజా సమస్యల పరిష్కారమే వైసిపి ధ్యేయమని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని వెంకటగారిపల్లి పంచాయతీ గ్రామంలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారం కోసం అక్కడే ఉన్న అధికారులతో మాట్లాడారు. జగనన్న కాలనీ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. పారదర్శక పాలన జగనన్నతోనే సాధ్యమని చెప్పారు. గత ప్రభుత్వం జన్మభూమి కమిటీల పేరుతో టిడిపి నాయకులకే ప్రాధాన్యత ఇచ్చేవారన్నారు. ఈ ప్రభుత్వం అలా కాకుండా వాలంటీర్ల ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్నట్లు చెప్పారు. అనంతరం వైసిపి ప్రభుత్వం చేపడుతున్న పథకాలకు సంబంధించి బ్రోచర్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రమణారెడ్డి, జడ్పిటిసి లక్ష్మీనరసమ్మ, మండల కన్వీనర్ నరసారెడ్డి, మాజీ కన్వీనర్ గంగాద్రి, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు తిరుపాల్ నాయక్, కన్యాకుమారి, కౌన్సిలర్ సాయి గీత, జ్యోతి, కవిత కో ఆప్షన్ సభ్యులు మాబుసాబ్, అగ్రి అడ్వయిజరీ కమిటీ సభ్యులు సూర్యనారాయణ రెడ్డి, సింగల్‌విండో అధ్యక్షులు ఈశ్వర్ రెడ్డి, మల్లికార్జున, గోవింద నాయక్, వెంకటగారిపల్లి సర్పంచి లక్ష్మీదేవి, నిడిమామిడి సర్పంచి కుల్లాయిరెడ్డి, వైసిపి నాయకులు గోవిందప్ప, మారుతి రెడ్డి, నరసింహారెడ్డి గంగాద్రి, ఎంపీడీవో అశోక్ కుమార్‌రెడ్డి, తహశీల్దార్ నవీన్ కుమార్, ఏపీడీ రఘునాథరెడ్డి పాల్గొన్నారు.

ప్రతి ఇంట్లో నవరత్నాల వెలుగులు : ఎమ్మెల్సీ

హిందూపురం : ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి అమలు చేస్తున్న నవరత్నాలతో ప్రతి ఇంట్లో వెలుగులు నిండాయని వైసిపి నియోజకవర్గ ఇన్‌చార్జ్, ఎమ్మెల్సీ షేక్ మహమ్మద్ ఇక్బాల్ పేర్కొన్నారు. గురువారం మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇంద్రజతో కలిసి ఎమ్మెల్సీ పట్టణంలోని పలు వార్డుల్లో 'జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమాలను నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు, ప్రజల సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ఇచ్చిన మాటకు కట్టుబడి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి హామీలన్నీ అమలు చేస్తున్నారని తెలిపారు. రాష్ట్ర భవిష్యత్తు ఆయనతోనే సాధ్యమని చెప్పారు. 14వ వార్డులో వైస్ ఛైర్మన్ బలరామిరెడ్డి, 21వ వార్డులో మారుతీ రెడ్డి, 13వ వార్డులో సునీత వెంకటేష్ రెడ్డి ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్తు- మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన విభాగం అధ్యక్షులు లోకేష్ వాల్మీకి, బేవనహళ్లి సర్పంచి ఆనంద్, నాయకులు ఆనంద్ రెడ్డి, లక్ష్మీనారాయణ, వేణు రెడ్డి, శివా రెడ్డి, బండి రాము, వంశీకష్ణా, అశోక్, సాయి, మధు, కౌన్సిలర్ సునీత వెంకటేశ్వర రెడ్డి, వైసిపి మీడియా కో-ఆర్డినేటర్ ప్రణయ్ రెడ్డి, సచివాలయ కన్వీనర్లు స్వాతి, శబరీశ్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, బాబా, గోపాల్ రెడ్డి, నంజుండరెడ్డి, కొండప్ప, సిద్ధప్ప పాల్గొన్నారు.

ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు : ఎమ్మెల్యే

నల్లచెరువు : వైసిపి పాలనలో ప్రతి గడపకూ సంక్షేమ పథకాలను చేరుస్తున్నామని కదిరి ఎమ్మెల్యే పివి.సిద్దారెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని ఉబిచర్ల గ్రామపంచాయతీలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఏర్పడిన నాలుగు సంవత్సరాల కాలంలో అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతూ పేద ప్రజలకు నిత్యం అందుబాటులో ఉందన్నారు. సచివాలయ వ్యవస్థద్వారా ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. అభివృద్ధిని చూసి ఓర్వలేక ప్రతిపక్ష పార్టీలు ఓర్వలేక విమర్శలు చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కె.రమణ రెడ్డి, రాజప్ప, షమీవుల్లా, డీలర్ రాజారెడ్డి, నరసింహారెడ్డి, హరినాథ్ రెడ్డి, వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పుట్టపర్తి మండలంలో కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట

హిందూపురంలో మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఇక్బాల్, మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇంద్రజ

నల్లచెరువు మండలంలో మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సిద్ధారెడ్డి

మహిళలకు జగనన్న 'ఆసరా'

ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

మహిళా సంఘాలకు మెగా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

మహిళలకు అన్ని పథకాలను వర్తింపజేసి వారికి ఆసరగా రాష్ట్రంలో జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం పాలన సాగిస్తోందని ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి తెలిపారు. గురువారం స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో ఆసరగా 3వ విడత పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ధర్మవరం పట్టణంలోని 1136 డ్వాక్రా సంఘాలకు రూ.8.94కోట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వ పాలనలో ధర్మవరం పట్టణంలో 1508 ద్వారా సంఘాలు ఉండగా వాటిలో 407కు పైగా బోగస్ సంఘాలను సష్టించి రూ.5కోట్లకుపైగా ప్రజల సొమ్మును కాజేశారని చెప్పారు. వైసిపి అధికారంలోకి వచ్చాక బోగస్ సంఘాలను రద్దు చేసి ప్రజల సొమ్మును కాజేసిన వారిని జైలుకు పంపామన్నారు. ఇటీవల పాదయాత్రకు వచ్చిన లోకేష్ ప్రజలకు ఏం మంచి చేస్తాడో చెప్పేది పోయి ఎక్కువ కేసులు ఉండేవారే తన వద్దకు రావాలని ప్రజలను, టీడీపీ కార్యకర్తలను రెచ్చగొట్టడం విస్మయాన్ని కల్గించిందన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు, అధికారులు, మహిళలు పాల్గొన్నారు.

మోడీ మోసాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తాం

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

దేశంలో కార్పొరేట్ శక్తులకు ఊతం ఇస్తూ, అన్ని రంగాలనూ ప్రయివేటు పరం చేస్తున్న మోడీ ద్రోహాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తామని వామపక్ష పార్టీల నాయకులు తెలిపారు. గురువారం నాడు సిపిఐ కార్యాలయంలో సిపిఐ, సిపిఎం నాయకులు పాదయాత్రకు సంబంధించిన గోడ పత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్, సిపిఎం నాయకులు బ్యాళ్ల అంజి, పైపల్లి గంగాధర్ మాట్లాడుతూ, దేశానికి, ఏపీకి ప్రధాని మోడీ తీరని ద్రోహం చేస్తున్నారని తెలిపారు. ఈ నెల 14 నుంచి 30వ తేదీ వరకు పాదయాత్ర చేస్తూ ప్రజలను చైతన్య పరుస్తామన్నారు. ఏపీకి ప్రత్యేక హోదా, విభజన హామీలు నెరవేర్చలేదని, పోలవరం నిర్మాణంకు నిధులు, రాజధాని నిర్మాణం, రైల్వే జోన్ రాయలసీమ, ఉత్తరాంధ్రకు ప్రత్యేక ప్యాకేజీ అమలు చేయలేదన్నారు. విశాఖ ఉక్కును కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టాలని చూస్తున్నారన్నారు. బిజెపి మతోన్మాద నిరంకుశ పాలనను ఎండగట్టడానికి పాదయాత్రలో అన్ని వర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా నాయకులు ఆంజనేయులు, గౌస్ లాజాం, ఏఐటీయూ జిల్లా కార్యదర్శి బయన్న, వెంకటేశు పాల్గొన్నారు.

పోస్టర్లను విడుదల చేస్తున్న వామపక్ష నాయకులు

సేవింగ్స్ సర్టిఫికెట్ అందజేస్తున్న మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇంద్రజ

మహిళలకు పొదుపు పథకం

ప్రజాశక్తి-హిందూపురం

తపాలా కార్యాలయంలో ప్రారంభించిన పొదుపు పథకాన్ని ప్రతి మహిళా సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ ఛర్‌పర్సన్ ఇంద్రజ పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని తపాలా కార్యాలయంలో మహిళా సన్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్ పొదుపు పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈ పథకం గురించి తపాల ఎస్‌పి బాలసత్యనారాయణ, పోస్టు మాస్టర్ మార్కొండేయులు సమగ్రంగా వివరించారు. బాలికలు, మహిళలు వయస్సుతో నిమిత్తం లేకుండా రూ.1000 నుంచి 2లక్షల వరకు రెండు సంవత్సరాల కాలపరమితితో సేవింగ్స్ చేయవచ్చు అన్నారు. దీనికి 7.5శాతం గరిష్ట వడ్డీ ఇస్తారన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్, వెంకట కిషోర్, పోస్ట్ ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి : ఆర్డీవో

ధర్మవరం టౌన్ : పదోతరగతి పరీక్ష కేంద్రంలో మౌలిక సదుపాయాలు ఉండేలా చూడాలని ఆర్డీవో తిప్పేనాయక్ అధికారులకు సూచించారు. గురువారం పట్టణంలోని కొత్తపేట మున్సిపల్ గర్ల్స్ హై స్కూల్, ఎస్పీసీఎస్ బాలుర ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పదవ తరగతి పరీక్షా కేంద్రాలను ఆకస్మికంగా పరిశీలించారు. పరీక్ష గదుల్లో సదుపాయాలపై విద్యార్థులతో అడిగి తెలుసుకున్నారు.

అన్ని వర్గాలూ సమైక్యంగా ఉండాలి

కురుబ కార్పొరేషన్ ఛైర్మన్ కోటి బాబు

ప్రజాశక్తి బత్తలపల్లి

సమాజంలో అన్ని వర్గాల ప్రజలు సమైక్యంగా ఉండి అభివద్ధి సాధించాలని ఏపీ కురుబ కార్పొరేషన్ ఛైర్మన్ కోటి సూర్యప్రకాష్ బాబు తెలిపారు. గురువారం రాత్రి పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా బత్తలపల్లిలో ముస్లింలకు ఆయన ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఈ సందర్భంగా ముస్లింలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆనంతరం కోటి బాబు మాట్లాడుతూ అన్ని మతాలు ఎదుటి వారిని ప్రేమించడంతోపాటు మానవతా విలువలతో సత్ప్రవర్తన కలిగి ఉండాలన్నారు. ముస్లిముల అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తున్నారని చెప్పారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ కోటి సుధ, ఎంపీటీసీ కోటి నరేష్, ఉప సర్పంచి కోటి గోపినాథ్‌ను ముస్లిములు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కో ఆప్షన్ మెంబర్ కరీంసాబ్, మైనార్టీ సెల్ అధ్యక్షులు బాబాజాన్, టైలర్ బాబా, జిలానీ, మన్సుల్, నడిమింటి షేకా, అలీమా తదితరులు పాల్గొన్నారు.

జగనన్నను మరోసారి ఆదరించండి

రాష్ట్రంలోని అన్ని వర్గాల వారికి న్యాయం చేస్తున్న సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా ఆదరించాలని ఏపీ కురుబ కారొరేషన్ ఛైర్మన్ కోటి సూర్యప్రకాష్ బాబు పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రమైన బత్తలపల్లి పాతవూరులో 'నువ్వే మా నమ్మకం జగన్' అనే కార్యక్రమాన్ని సర్పంచి అక్కిం కాశమ్మతో కలిసి ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన జగన్మోహన్‌రెడ్డి పాలనలో ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కోఆప్షన్ మెంబర్ కరీంసాబ్, సింగిల్ విండో డైరెక్టర్ ఈడిగ కాశప్ప, జిక్రియా, షేక్షావలి, బాబ్‌జాన్ పాల్గొన్నారు.

ముస్లిం మహిళలకు అందజేస్తున్న కోటి సూర్యప్రకాష్‌బాబు దంపతులు

'ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదు.'..

ప్రజాశక్తి-హిందూపురం

చిలమత్తూరు సమీపంలోని టేకులోడు గురుకుల పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న వారిపై స్థానిక పోలీసు అధికారుల నుంచి డిజిపి వరకు ఫిర్యాదు చేసినా ఎటువంటి చర్యలూ తీసుకోవడం లేదని ఆ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థి తల్లి నళిని ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆమె విలేకరులతో మాట్లాడారు. తనకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారని, ఆ ఇద్దరినీ టేకులోడు గురుకుల పాఠశాలలో చదివిస్తున్నట్లు పేర్కొన్నారు. వీరిలో 8వ తరగతి చదువుతన్న తన కుమార్తెను అదే పాఠశాలలో నైట్ వాచ్‌మ్యాన్‌గా పని చేస్తున్న నరసింహమూర్తి లైంగికంగా వేదించాడని చెప్పారు. ఇతనిపై చర్యలు తీసుకోవాలని పలుమార్లు కోరినప్పటికీ అక్కడ పని చేస్తున్న ప్రిన్సిపల్ ఈ విషయం బయటకు చెబితే టిసి ఇచ్చి పొంపుతామని తన కుతురిని బెదరించారన్నారు. ఈ విషయాన్ని సెలవుల్లో ఇంటికి వచ్చిన సమయంలో తన కూతురు తనకు చెప్పింది అన్నారు. ఈ విషయంపై స్థానిక పోలీసుల నుంచి డిజిపి వరకు ఎవరికి ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోలేదన్నారు. పోలీసులు తగిన సమయంలో స్పందించి ఉంటే గత నెల మహతి అనే విద్యార్థి మరణించి ఉండేది కాదన్నారు. టేకులోడు పాఠశాలలో జరుగుతున్న విషయాలపై ఉన్నతాధికారులు స్పందించి సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు.

పర్యావరణంపై బిట్ కళాశాలలో సదస్సు

హిందూపురం : హిందూపురం రూరల్ మండల పరధిలోని బిట్ కళాశాలలో కొత్తచెరువుకు చెందిన ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ఆర్గనైజషన్ వారి ఆధ్వర్యంలో పర్యావరణం, మానవ హక్కులపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో భాస్కర్ నాయుడు మాట్లాడుతు మానవ హక్కులు, పర్యావరణ పరిరక్షణ ఒకదానితో ఒకటి ముడిపడి ఉన్నాయని, పర్యావరణ మానవ హక్కులను ప్రోత్సహించాలని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ రమేష్ మాట్లాడుతూ పర్యావరణం, మానవ హక్కుల గురించి అవగాహన కల్పించారు.

నేరాలు ఘోరాలు

ఆర్టీసీ బస్సు- ద్విచక్ర వాహనం ఢీ ఒకరు మృతి

ప్రజాశక్తి-అగళి

మండల పరిధిలోని నగలూరు, ముత్తేపల్లి గేట్ గ్రామాల మధ్యలో గురువారం ఉదయం ఆర్టీసీ బస్సు, ద్విచక్ర వాహనం ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి మరణించాడు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... రొళ్ల వైపు వెళుతున్న ఆర్టీసీ బస్సు, కరీదాశనపల్లి వైపు వెళుతున్న ద్విచక్ర వాహనాన్ని ముత్తేపల్లి గేట్ వద్ద ఢీ కొట్టింది. ఈ సంఘటనలో బైకును డ్రైవ్ చేస్తున్న కరీదాసనపల్లి గ్రామానికి చెందిన బోయ మంజునాథ్ కుమారుడు బసవరాజు(25), ప్రకాష్‌లు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం మడకశిర ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో బసవరాజు మృతి చెందాడు. ఘటనా స్థలాన్ని ఎస్ఐ లావణ్య పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం- దేవరపల్లి రైల్వే స్టేషన్ మధ్యలో గురువారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తి రైలు కిందపడి మృతి చెందినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. వారు అందించిన వివరాల మేరకు... కొట్నూరు రైల్వేగేట్‌కు సమీపంలో గుర్తుతెలియని 35 నుంచి 40 సంవత్సరాల మధ్య వయస్సున్న రైలు కిందపడి చనిపోయాడన్నారు. మృతుడు చామనచాయ రంగులో ఉన్నాడని, తెల్లటి పంచ, ఎరుపు రంగు రెడీమేడ్ డ్రాయర్ వేసుకున్నాడని చెప్పారు. మతిని వద్ద గుర్తించుటకు ఎటువంటి ఆనవాళ్లు లేవన్నారు. పై తెలిపిన అనవాళ్ల మేరకు ఎవరైన గుర్తిస్తే 9441238182, 9440627641కి సమాచారం అందించాలని కోరారు.

కుక్కల దాడిలో 15 గొర్రెలు మృత్యువాత

ప్రజాశక్తి అమరాపురం

మండల పరిధిలోని హాలుకూరు గ్రామానికి చెందినగొల్ల కష్టప్ప చెందిన గొర్రెల మందపై గురువారం నాడు కుక్కలు దాడి చేశాయి. సాయంకాలం ఐదు గంటల సమయంలో గొర్రె మందలో గొర్రెపిల్లలపై దాడి చేయడంతో 15 మృతి చెందాయి. దాదాపు రూ.2 లక్షల నష్టం వాటిల్లిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.

మట్టి నమూనాల సేకరణపై శిక్షణ

ప్రజాశక్తి-రామగిరి

మండల కేంద్రంలోని వ్యవసాయ అధికారి కార్యాలయంలో మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల సిబ్బందికి మట్టి నమూనాల సేకరణపై మండల వ్యవసాయ అధికారి మురళీ కష్ణ, ఎంపిఇఒ రామమోహన్ ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు. రైతుల పొలాల్లో మట్టిని ఏ విధంగా సేకరించాలి.? పరీక్ష నిమిత్తం ప్రయోగశాలకి ఎలా పంపించాలి, ఎలాంటి జాగ్రత్తలు పాటించాలి అనే విషయాలపై అవగాహన కల్పించారు.

ఎఎస్ఐకు సేవా పథకం

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

ధర్మవరం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్లో ఎఎస్ఐగా పనిచేస్తున్న కేతన్నకు విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సేవా పథకం ప్రకటించింది. ఎఎస్ఐ కేతన్న విధుల పట్ల అంకితభావంతో పనిచేసినందుకు రాష్ట్రప్రభుత్వం గుర్తించి తనకు సేవా పథకాన్ని ప్రకటించడం ఆనందంగా ఉందని ఎఎస్ఐ కేతన్న తెలిపారు. 2018లో ఉత్తమ ప్రతిభను గుర్తించి సేవా పథకాన్ని అందించారని గుర్తు చేశారు. కేతన్నను వన్‌టౌన్ సిఐ సుబ్రమణ్యం, ఎస్ఐ మహమ్మద్ రఫీ, సిబ్బంది అభినందనలు తెలియజేశారు.

శ్రీరాములు నాయక్ కుటుంబంపై దాడి హేయం : సవితమ్మ

ప్రజాశక్తి -పెనుకొండ

మండలంలోని కొండంపల్లి గ్రామానికి చెందిన శ్రీరాములు నాయక్ కుటుంబంపై వైసిపి నాయకుల దాడి దుర్మార్గమైనదని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవితమ్మ తెలిపారు. గురువారం పట్టణంలోని సవితమ్మ కార్యాలయం వద్ద శ్రీరాములు నాయక్ కుటుంబ సభ్యులతో ఆమె మాట్లాడారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసానిచ్చారు. వైసిపీ నాయకులు శ్రీరాములు నాయక్ ఇంటిపై వైసిపి స్టిక్కర్లు అతికించడానికి వెళ్లి దాడికి పాల్పడ్డారన్నారు. వైసిపి పాలనలో నిత్యకృత్యం అయ్యాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల మాజీ కన్వీనర్ శ్రీరాములు, గుట్టూరు మాజీ సర్పంచి సూర్యనారాయణ, సుబ్రహ్మణ్యం, త్రివేంద్ర నాయుడు, దాదు పాల్గొన్నారు.

శ్రీ చైతన్య విద్యార్థుల ప్రభంజనం

ప్రజాశక్తి-కదిరి టౌన్

ఇంటర్నేషనల్ టాలెంట్ సెర్చ్ ఒలంపిడ్ పరీక్షలలో విద్యార్థులు ప్రభంజనం సష్టించినట్లు ఏజీఎం సుబ్బారెడ్డి తెలిపారు. ఈ మేరకు సత్తా చాటిన విద్యార్థులకు గురువారం కదిరి పట్టణంలోని శ్రీ చైతన్య విద్యాసంస్థ నందు ఏజీఎం సుబ్బారెడ్డి చేతుల మీదుగా బహుమతులు ప్రధానం చేశారు. ఏజీఎం సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి అనంతపురం జిల్లా జోన్లో ఉన్నటువంటి కదిరి శ్రీ చైతన్య పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు జాతీయస్థాయిలో సత్తా చాడడం గర్వకారణం అన్నారు. ఐదో తరగతి చదువుతున్న ఫైర్ బోల్ట్ స్మార్ట్ వాచ్‌ను, రెండో బహుమతి హరిప్రీత్ రెడ్డి ఆరో తరగతి చదువుతున్న రిషిత, మూడో బహుమతి ఫింగర్స్ ఎంటిఒ పోర్టబుల్ స్పీకర్ సాధించారన్నారు. 5 6 7 తరగతి విద్యార్థులకు వాక్యూమ్ ప్లాస్కులు, సర్టిఫికెట్, గోల్డ్ మెడల్స్ సాధించారన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఏజీఎం సుబ్బారెడ్డి, ప్రిన్సిపల్ హరిత అభినందించారు. ఈ కార్యక్రమంలో డీన్ చిరంజీవి, ప్రైమరీ ఇన్‌ఛార్జిలు అమజాన్, తేజస్విని, ఇంద్రజ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైసిపి నాయకునికి పరామర్శ

ప్రజాశక్తి-కొత్తచెరువు

వైసిపి జిల్లా కార్యవర్గ సభ్యుడు వాల్మీకి శంకర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో కాలు విరగడంతో వైద్య చికిత్సలు చేయించుకుని గత 20 రోజులుగా ఇంటి వద్ద ఉంటున్నాడు. ఈయనను వైసీపీ పుట్టపర్తి నియోజకవర్గ మాజీ సమన్వయకర్త కొత్తకోట సోమశేఖర్ రెడ్డి ఆయన కుమారుడు చక్రధర్ రెడ్డి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు యల్లప్ప, బళ్లారి బాబు, శివ పాల్గొన్నారు.

యువకవి సుధాకర్‌కి సన్మానం

ప్రజాశక్తి-చిలమత్తూరు

శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో ఈనెల 9,10,11వ తేదీల్లో తిరుపతి మహతీ ఆడిటోరియంలో 48 గంటల పాటు నిర్విరామంగా జరిగిన ప్రపంచ తెలుగు సాహిత్య బ్రహ్మోత్సవాల్లో పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన చిలమత్తూరు మండలం హుస్సేన్‌పురానికి చెందిన యువకవి వడ్డి సుధాకర్‌ను గురువారం సన్మానించారు. ఒకేసారి ఐదు రికార్డులు నేషనల్ తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్, అమేజింగ్ వరల్డ్ బుక్ఆఫ్ రికార్డ్, మార్వెల్ బుక్ ఆఫ్ ది రికార్డ్, కల్చరల్ బుక్ ఆఫ్ ది రికార్డ్, న్యూ వండర్ వరల్డ్ రికార్డులకు కెక్కి రికార్డుల్లో తన పేరు నమోదు చేసుకున్నాడు. రికార్డులు కైవసం చేసుకున్న సుధాకర్‌నె శ్రీశ్రీ కళావేదిక ఛైర్మన్ డా.కత్తిమండ ప్రతాప్ ఆధ్వర్యంలో గజమాలతో, జ్ఞాపికతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ కొల్లి రమావతి, ఏపీ రాష్ట్ర అధ్యక్షులు గుత్తా హరిసరోత్తమ నాయుడు తదితరులు పాల్గొన్నారు.



యువ కవి వడ్డి సుధాకర్‌కు సన్మానిస్తున్న దృశ్యం